# నా భార్య

రచయిత :
ఎస్. ఆర్. రావు

ఎడ్యుకేటెడు గరల్సుమీద నాకెంత మోజో మా నాన్నకంతసహ్యము. నామోజు కననుగుణ్యంగా మూర్ఖాచారాలతో మ్రగ్గివున్న వెదురుపర్తి గ్రామపు పిల్లనోదాన్ని సంబంధముగా చూశాడు.

పెళ్ళికొడుకు స్టేజిలో నేనీలోకములో లేను. నా దృష్టి అంతా కిలకిలమంటు కళకళలాడే కాలేజీ పిల్లలమీదవుంది.

పెళ్ళయిదు రోజులూ అయిదు యుగాల్లాగ గడిచింది.

కొన్నాళ్ళుపోయినతరువాత నాభార్య కాపురానికొచ్చింది. మొదటామెదగ్గర ముభావముగా మెలగుతుండేవాణ్ని గాని, ఆతళుకు బెళుకు వాలారుచూపులకు ముగ్ధుణ్ణయ్యాను.

ఓనాడు కాఫీ అందిస్తుంటే 'నీపేరు' అని అడిగాను. నమ్మండి నమ్మకపోండి, నిజంగా అంతవరకు నా భార్యపేరు నాకు తెలీదు. తెలుసుకో దలచుకోలేదుకూడ.

'పెంటమ్మ' అని ముసిముసి నవ్వులతో సమాధాన మిచ్చింది.

'ఏడ్సినట్టుంది వెధవపేరు' అని గొణిగాను.

మా ఆవిడ తోకత్రొక్కిన త్రాచులాగైంది. 'మీరు బ్రతికుండగా నే వెధవేలానవుతాను, అంటూ కాఫీకప్పు క్రిందపెట్టేసి మాయమయింది.

ఓనాడు నా భార్యతో అన్నా. నీపేరేమీ బాగాలేదు. రమ అని మార్చుకో.

ఒప్పుకోలేదు ఆవిడ. పెంటమ్మనే పదము దానికెంతో మృదువుగా, ముచ్చటగా వుందట. గాని నాకుమట్టుకు అది కర్ణకఠోరముగా వుంది. ఆపేరెట్టి పిలవడానికి సిగ్గేసేది, దగ్గో, ఏదో చప్పుడు చేసో, ఆమె Attention నాప్రక్కకు త్రిప్పుకొంటుండేవాణ్ణి.

భార్యని Control చేసుకొన్నంత శక్తి నాకు లేకపోయిందా అని లేనికోపము దెచ్చుకొని మా ఆవిణ్ణి పిలచా.

'నీకెందుకీ పంతం.'

'మాకు దేవుడిపేర్లు అబ్బవండీ'

'అబ్బకపోవడమేంటి'?

మా నాన్నకి పుట్టిన పిల్లలకి దేవతల పేరు బెడితే బ్రతికారుకారు. నేపుట్టగానే పెంటమ్మనే పేరుబెట్టారు. పేరు యిప్పుడు మార్చుకొంటే నేచచ్చిపోయి మా నాన్నకి అమ్మకి దుఃఖము కలిగిస్తానేమో.

ఆమె అమాయకత్వానికి, నంగిరితనానికి నాకు జాలివేసింది. పోతులాగుంది. పేరు మార్చుకొంటే చస్తుందట. కారణం? దేవతలపేర్లు వాళ్ళకబ్బవట. వెధవ 'Superstition'.

Superstition కి అర్థము తెలియకపోవడము వల్లగాని లేకపోతే ఓ కర్టెన్ లెక్చరు దంచివుండేది.

చిన్ననాటి స్నేహితు డొకడు వచ్చాడు. నన్ను చూడ్డానికి. వాడికి ఆతిథ్యమిచ్చాను.

మేమిద్దరము భోంచేస్తున్నాము. నామిత్రుడు ప్రశ్నించాడు. ''నీ మిస్సెస్ పేరు?''

'రమాదేవి' అని ప్రత్యుత్తరమిచ్చాను.

'అబద్ధాలాడతారెందుకండీ' నా భార్య వాగింది. నా మిత్రుడి ప్రక్కచూస్తూ— 'ఏమండోయి! నాపేరు పెంటమ్మండీ. మా నాన్న బారసాలనాడు బియ్యముపళ్లెములో ఆపేరే రాశాడు. సరిపిల్లి కామయ్యపంతులు నడగండి. నిజానిజాలు తెలుస్తాయి. అతడే నాకు బారసాల చేయించాడట.

నాకు రిమ్మరెత్తింది. రెండు లెంపకాయ లివ్వాలనుకున్నాను. అతిథివుండటంచేత అందు కవకాశం కలుగలేదు.